క్లుప్తంగా

నేడు ఉద్యాన వర్సిటీ బృందం పర్యటన

పూడూరు: రాష్ట్ర ఉద్యాన వన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నీరజ, బృందం సభ్యులు బుధవారం పర్యటించనున్నట్లు పరిగి డివిజన్ ఉద్యాన శాఖ అధికారి వైజయంతి కల్యాణ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిధి మామిడితోటలు, పాలీహౌస్‌లను పరిశీలించనున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

కొడంగల్ రూరల్: మండల అభివృద్ధి కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పాండు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీక్షకు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు.. శాఖాపరమైన తాజా నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

రామలింగారెడ్డికి పరామర్శ


రామలింగారెడ్డిని పరామర్శిస్తున్న శుభప్రద్ పటేల్

తాండూరు రూరల్: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ రాంలింగారెడ్డిని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం రామలింగారెడ్డి తండ్రి ఏసురెడ్డి అనారోగ్యంతో మతి చెందాడు. విషయం తెలుసుకున్న శుభప్రద్ పటేల్.. మంగళవారం జినుగుర్తి గ్రామానికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. పటేల్ వెంట నాయకులు కుర్వ నర్సింహులు, భాను, శేఖర్, చందు, నరేష్ గౌడ్, శేఖరయ్య ఉన్నారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

దౌల్తాబాద్: తపస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులు మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. శాఖ మండల అధ్యక్షుడు నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం ఊషన్న, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటయ్య, కొడంగల్, బొంరాస్‌పేట మండలాల అధ్యక్షులు కె.నారాయణ, బి.చంద్రశేఖర్, కోశాధికారి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బాకారం మల్లయ్య, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

శ్రీవారి సేవకు రేగడిమైలారం భక్తులు


శ్రీవారి సేవకు తరలిన భక్తులు

బొంరాస్‌పేట: తిరుమల శ్రీవారి సేవకు మండల పరిధి రేగడిమైలారం నుంచి మరో భక్త జనబృందం మంగళవారం బయలు దేరింది. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పూజల అనంతరం.. ఆర్గనైజేషన్ చంద్రశేఖర్‌గౌడ్‌తో పాటు 14మంది మహిళలు, పురుషులు వెళ్లారు. గ్రూపు లీడరు మంగలి రవి సమక్షంలో ఈ నెల 25 నుంచి వచ్చే నెల 2వరకు సేవలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. తిరుమలకు వెళ్లిన వారిలో విశ్వనాథం, శేఖరయ్య, నగేశ్, కుమ్మరి వెంకటమ్మ, నెల్లి వెంకటమ్మ, వెంకటమ్మ, పద్మమ్మ, లక్ష్మమ్మ, శ్రీనివాస్, వెంకటయ్య ఉన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయండి..


మాట్లాడుతున్న యూత్‌కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట: కొడంగల్ నియోజకవర్గంలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు జీఓ విడుదల చేయడం చేయడం ఆనందంగా ఉందని యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు అన్నారు. ఈ మేరకు వారు మంగళవారం మాట్లాడారు. బొంరాస్‌పేట మండలానికి కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని కోరారు. అలాగే పెద్ద చెరువు వద్ద ట్యాంక్‌బాండ్‌గా నిర్మించి, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడంతో పాటు, దుద్యాల మండలం చెట్టుపల్లితండాలోని కేజీబీవీ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు. యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రమేష్, భానుప్రకాశ్ ఉన్నారు.

శ్రీరామ.. జయరామ

ఘనంగా రాములోరి ఉత్సవాలు


కార్యక్రమంలో చీకోటి తదితరులు


సీతారాముల వేషధారణలో చిన్నారులు

తాండూరు టౌన్: తాండూరులో అయోధ్య ఉత్సవాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. గోశాల సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సీతారాముల శోభాయాత్ర ఆద్యాంతం శ్రీరామ.. జయరామ నామ జపంతో మార్మోగింది. స్థానిక స్టేషన్ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు.. కాళికాదేవి ఆలయం, వినాయక్‌చౌక్, ఇందిరాచౌక్, గంజ్, మర్రిచెట్టు కూడలి, గాంధీచౌక్, మార్వాడీ బజార్, పాండురంగ దేవాలయం నుంచి గోశాల వరకు కొనసాగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హైదరాబాద్ విజయ వినాయక ఆలయ చైర్మన్ డాక్టర్ చీకోటి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.


ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం

పోరాట యోధుడు నేతాజీ

- యువత ఆదర్శంగా తీసుకోవాలి
- చంద్రబోస్ జయంతిలో నేతలు

మోమిన్‌పేట: పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టరు మెతుకు అనంద్ సూచించారు. మంగళవారం మండల పరిధి గోవిందాపూర్, ఎన్కేపల్లి గ్రామాల్లో నేతాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య సమరంలో ఆయన కృషిని మరువలేనిదని, తన ప్రాణాన్ని తృణప్రాయంగా పెట్టిన మహానుభావుడు అని కొనియాడారు. స్వాతంత్ర్యం కొరకు అజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించాడని పేర్కొన్నారు. అలాంటి మహనీయుని అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకొని, దేశ భక్తిని చాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోపాల్‌రెడ్డి, సాయిలు, మల్లయ్య, మైపాల్‌రెడ్డి, బాబుమియా, శ్రీనివాస్ ఉన్నారు.

తాండూరు టౌన్‌లో..

తాండూరు టౌన్: స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని తాండూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శాంత్‌మహల్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నేతాజీ వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, తెలంగాణ జన సమితి కౌన్సిలర్ సోమశేఖర్, పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవీన్, శ్వేత, అజయ్, మౌనిక, ఊర్మిళ, శివనీల, అభి తదితరులు నేతాజీకి నివాళులర్పించారు.


తాండూరు టౌన్: నేతాజీ వేషధారణలో ఉన్న చిన్నారుల నడుమ మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న

సల్బత్తాపూర్‌లో..

బంట్వారం: సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మండల పరిధి సల్బత్తాపూర్‌లో యువజన సంఘం సభ్యులు నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.


తాండూరు టౌన్: నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి


మోమిన్‌పేట: నేతాజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంద్


బంట్వారంలో..

పర్మిషన్ కొంత, తవ్వేది వాగంత!

- పక్కదారి పడుతున్న ఇసుక
- ట్రాక్టర్లను అడ్డుకున్న సర్పంచ్ లలిత, గ్రామస్తులు

తాండూరు రూరల్: ఒకటి, రెండు ట్రాక్టర్ల ట్రిప్పుల పర్మిషన్ పేరుతో ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తున్నారని, వెంటనే వాటి అనుమతులను రద్దు చేయాలని సర్పంచ్ లలిత డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధి ఖాంజాపూర్ వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులతో కలిసి ఆమె అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాగు నుంచి నిత్యం 30కి పైగా ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్నాయని, ఇలా ఇష్టానుసారంగా ఇసుకను తోడేస్తే.. భూగర్భ జలాలు అడుగంటిపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మాత్రమే అనుమతి ఉన్నా.. అర్ధరాత్రి వరకు ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అంతే కాకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలు రాత్రి, పగలు వీధుల్లో అతివేగంగా పరుగులు తీస్తుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారని, రెవన్యూ అధికారులు స్పందించి, పర్మిషన్లను నిలిపివేయాలని కోరారు.


ట్రాక్టర్లను అడ్డుకున్న సర్పంచ్, గ్రామస్తులు

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మండల విద్యాధికారి చంద్రప్ప

బంట్వారం: ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి చంద్రప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మానవ వనరుల భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టెన్త్‌లో వంద శాతం ఫలితాలు రాబట్టేలా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని హెచ్ఎంలకు సూచించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుందని, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ప్రతి రోజు తెల్లవారు జామున నాలుగు గంటలకు విద్యార్థులకు ఫోన్ చేసి నిద్ర లేపాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే, వెంటనే వాటిని నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరళారెడ్డి, బంట్వారం, తొర్మామిడి హెచ్ఎంలు శ్రీనివాస్, శారద, సీఆర్‌పీ నర్సింహులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రప్ప

'ప్రజా సంక్షేమం' పట్టని బ్యాంకర్లు!


భారత్ ప్రచార రథం వద్ద గ్రామస్తులు

- కేంద్రం అందజేస్తున్న రుణాలపై అవగాహన కల్పించని వైనం
- బ్యాంకు ఖాతాదారుల ఆందోళన

మోమిన్‌పేట: కేంద్రం అమలు చేస్తున్న పథకాల గురించి బ్యాంకుకు వెళ్లినా, పల్లెలకు 'మా సంకల్పం, అభివృద్ధి భారత్' ప్రచార రథం వచ్చినా బ్యాంకు అధికారులు వాటి గురించి ఖాతాదారులకు వివరించడం లేదని పలువురు ఆరోపించారు. అసలు ప్రచార రథం వద్దకు అధికారులు రావటం లేదని, ప్రజా సంక్షేమం వారికి పట్టడం లేదని మండిపడ్డారు. మంగళవారం మండల పరిధి ఎన్కేపల్లి గ్రామంలో మా సంకల్పం అభివృద్ధి భారత్ ప్రచార రథం.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి డిజిటల్ స్క్రీన్‌పై చూపెడుతున్న అంశాలపై ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కోఆర్డినేటరు మల్లేశ్ ప్రజలకు వివరించారు. ఎన్‌పీసీఐ విధివిధానాలను బ్యాంకు ఖాతాదారుడికి అధికారులు తెలియజెప్పాల్సిన అవసరం ఉందని, ఈ ప్రచార రథం ఏ గ్రామానికి వెళ్లినా.. వెంట ఉండి, ప్రజలకు బ్యాంకులు అందజేస్తున్న ముద్ర తదితర రుణ సౌకర్యాలను తెలపాల్సి ఉందని పేర్కొన్నారు. ఉజ్వల, రైతులకు పెట్టుబడి సహాయం, ఇళ్ల నిర్మాణం, ఉచిత రేషన్, వైద్య సహాయం, ప్రతి ఇంటికి తాగు నీటి కొరకు కుళాయి ఏర్పాటు వంటి పథకాలను వివరించారు.

బ్యాంకుల్లో జమకాని డబ్బులు

కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాల గురించి తమకు తెలియదని, బ్యాంకు అధికారులు ఎవరు కూడా వాటి గురించి వివరించని స్థానికులు ఆరోపించారు. ఖాతాదారులకు ఎన్‌పీసీఐ చేయకపోవడం వలన కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, సీసీఐకి పత్తిని విక్రయించగా.. వచ్చే డబ్బులు కూడా బ్యాంకులో జమ కావడం లేదని రైతులు చెప్పారు. డిజిటల్ ఇండియాకు విరుద్ధంగా బ్యాంకు అధికారులు విధులను నిర్వహిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయం వద్దు.. గ్రామాభివృద్ధి చేయండి

- డీఎల్‌పీఓ శంకర్ నాయక్
- వార్డు సభ్యుల ఫిర్యాదు మేరకు జీపీ రికార్డుల తనిఖీ

తాండూరు రూరల్: రాజకీయాలు పక్కన పెట్టి, గ్రామాభివృద్ధికి కృషి చేయాలని గ్రామస్థాయి పాలకులకు డీఎల్‌పీఓ శంకర్ నాయక్ సూచించారు. వార్డు సభ్యుల సంతకాలు లేకుండా అల్లాపూర్ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి పలు తీర్మానాలు చేశారన్న వార్డు సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం డీఎల్‌పీఓ నాయక్ విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా పంచాయతీలోని రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం వార్డు సభ్యులతో సమీక్షించారు. మూడు నెలలకు ఒకసారి గ్రామ పంచాయతీ సమావేశం ఎందుకు నిర్వహించడం లేదని జీపీ కార్యదర్శి భవానీని, సమీక్షలు నిర్వహిస్తున్నారా.. లేదా అనే విషయంపై ఎందుకు దృష్టి సారించలేదని ఎంపీఓ రతన్‌సింగ్‌ను డీఎల్‌పీఓ ప్రశ్నించారు. తాము సంతకాలు చేయకున్నా.. తీర్మానాలు చేశారని వార్డు సభ్యుడు శ్యామప్ప డీఎల్‌పీఓ ఎదుట వాపోగా.. అందరి అభిప్రాయం మేరకే తీర్మానం చేసినట్లు సర్పంచు పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంతాలకు పోయి గ్రామాన్ని నిర్లక్ష్యం చేయరాదని, గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెన్నప్ప, వార్డు సభ్యులు ఉన్నారు.


విచారణ చేపడుతున్న డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య

షాబాద్: మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మిద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, మైనార్టీ అధ్యక్షుడు అశ్వక్‌అలీలు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మిద్దెంగూడ గ్రామంలో మంగళవారం దర్గావద్ద స్లాబ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సముచితమైన న్యాయం జరుగుతుందని తెలిపారు. మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ ఎళ్లవేళలా కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకయ్య, భూపతిరాజు, పాపిరెడ్డి, పురుషోత్తం, అక్బర్, హుస్సేన్ పాల్గొన్నారు.

సర్కారు బడుల బలోపేతానికి కృషి

మండల విద్యాధికారి అక్బర్

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి అక్బర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం టీయుటీఎఫ్ క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ మునీర్‌పాషతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. డీఏ, పీఆర్సీ బకాయిలను వెంటనే జమ చేయాలన్నారు. ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ పోరాడాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దయానందం, శివానందం, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, జిల్లా కార్యదర్శి అంజయ్య, మెగులయ్య, మండల గౌరవ అధ్యక్షుడు శంకరయ్య ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: కాంగ్రెస్‌తోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ప్రభుత్వ సలహాదారులుగా ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డి, మల్లురవి, అర్క గోపాల్‌లను వేరువేరుగా వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. పేదలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే దిశగా ప్రభుత్వం పయనిస్తుందని వెల్లడించారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తదితరులు

దోమ: విద్యావ్యవస్థ ఉన్నతికి ఉపాధ్యాయ సంఘాలు కృషిచేయాలని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం దోమ మండల కేంద్రంలో యూటీఎఫ్ సంఘం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాయుతంగా ముందుకు సాగనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి సక్రియనాయక్, నాయకులు వసురం, మల్లేశం, వెంకటయ్య, అనంతయ్య, జంగయ్య, తిరుపతి, పాండురంగచారీ, యూసుఫ్, రాములు, బాలవర్ధన్, మల్లేశ్, ప్రసాద్, కృష్ణయ్య, రవి, బీమ్లా, శేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ముట్పూర్ హెచ్ఎం చెన్నారెడ్డి పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని ముట్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వలన పోటీతత్వం పెరుగుతుందన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని తెలిపారు.

గెలుపోటములు సర్వసాధారణం..

క్రీడల్లో గెలుపోటములు సర్వ సాధారణమేనని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. వారం రోజులుగా కొందుర్గు మండల కేంద్రంలో కొనసాగుతున్న కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి అంజయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, రవీందర్ రెడ్డి, దర్గ రామచంద్రయ్య, ఖలీమ్, శ్రీశైలం పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: క్రీడకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడుతాయని మాంటిస్సోరి పాఠశాల సీఈఓ జార్జ్ థామస్ పేర్కొన్నారు. రెండు రోజులుగా షాబాద్ పీఆర్ఆర్ స్టేడియంలో మాంటిస్సోరి పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యం పెరుగుతుందని చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ మహేశ్‌యాదవ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పోనమోని రవేష్‌యాదవ్, మల్లేశ్ యాదవ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


కొందుర్గు: బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత

చేవెళ్ల: విద్యార్థులు చదువుతో పాటు వ్యాపార నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కామర్స్ డిపార్ట్‌మెంట్, ఈడీపీ కాల్ ఆధ్వర్యంలో వ్యాపార నైపుణ్య అభివృద్ధి పెంపొందించేందుకు ఫుడ్ పెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటకాలు, తినుబండారాలు తయారు చేసి ప్రదర్శనలో విక్రయించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈడీపీ కాల్ కన్వీనర్ ఆర్ వైష్ణవి, అధ్యాపకులు అనురాధ, రూప్నారవీంద్రన్, జ్యోతి, షేక్ మహబూబ్, రవీందర్, రాగిణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బెంచీల వితరణ


బెంచీలను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

దోమ: ప్రభుత్వ పాఠశాలల ఉన్నతికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయడం అభినందనీయమని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. మంగళవారం మండల పరిధి బొంపల్లి కాంప్లెక్స్ పాఠశాల, బాసుపల్లి, గోడుగోనిపల్లి, దోర్నాల్‌పల్లి, మైలారం, కేశిలమ్మ తండా, గూడురు, దొంగఎన్నేపల్లి తదితర పాఠశాలకు మోడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్యూయెల్ డెస్క్ బెంచీలు, గ్రీన్ బోర్డులు, టేబుల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ప్రభుత్వ బడులకు మౌలిక సదుపాయాలు కల్పించడం వలన, ప్రజలు తమ పిల్లలను సర్కారు బడుల్లో చదివించేందుకు మొగ్గుచూపుతారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్, షఫీ, వీరేష్, సుహాసిని, ఉప సర్పంచ్ రఫిక్ పాష, పాఠశాల చైర్మన్ అనంతయ్య, ఉపాధ్యాయులు నీల్ సింగ్, రుక్మిణి, శైలజ, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.